క్లుప్తంగా

డీఏఎంను కలిసిన మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్



జనగామ: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీభాయ్‌ను జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ బాల్దె విజయ సిద్ధిలింగం శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు సంవత్సరాల పాటు చైర్‌పర్సన్‌గా కొనసాగిన సమయంలో లక్ష్మీభాయ్ అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. ప్రస్తుతం మార్కెట్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న కవర్‌షెడ్‌కు మరిన్ని నిధులు మంజూరు చేసి పనులు పూర్తయ్యేందుకు సహకారం అందించాలని కోరారు. మాజీ డైరెక్టర్ మాశెట్టి వెంకన్న ఉన్నారు.

రాయ్‌పూర్ ప్లీనరీలో టీజీ ఇన్‌చార్జ్‌ని కలిసిన 'జంగా'



జనగామ: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో తలపెట్టిన కాంగ్రెస్ 85వ ప్లీనరీ సమావేశంలో శుక్రవారం పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ నదీమ్ జావీద్, రోహిత్ చౌదరి, మాజీ పీసీసీ అధ్యక్షుడు బోస్‌రాజ్, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావును జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జనగామ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎర్రమళ్ల సుధాకర్ పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్



బచ్చన్నపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల పక్షపాతి అని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షబ్బీర్, ఎంపీటీసీ వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

దేవానాయక్ కుటుంబానికి పరామర్శ

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి మాజీ సర్పంచ్ గుగులోత్ దేవానాయక్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నెమురుగొమ్ముల సుధాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. దేవానాయక్ భార్య మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు గుగులోత్ పార్వతికి మేమున్నామంటు భరోసా ఇచ్చారు. వాసు నాయక్, వాలు నాయక్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు

దేవరుప్పుల: కోలుకొండలో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో నేటి నుంచి జరగబోయే శ్రీ దుర్గామాత ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా సామాజిక వర్గాల ఇలవేల్పులు, గ్రామ దేవతల పండుగలు కొనసాగుతున్నాయి. బొడ్రాయికి దేశగురువు ధనుంజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సర్పంచ్ కూర్నాల రవి, ఎంపీటీసీ దామెర రమ, బ్రహ్మణులు భాస్కరవజ్జుల సోమేశ్వరశర్మ, బైండ్ల పూజాజుట బొట్టు ఇంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో రైతు మృతి

తరిగొప్పుల: పొలం వద్ద ఫిట్స్ రావడంతో రైతు మృతిచెందిన సంఘటన శక్రవారం మండలంలోని సోలిపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దండెం రవి(45) తన వ్యవసాయ పొలం వద్ద పనిచేస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా రవి మృతిచెంది ఉండడంతో బోరున విలపించారు. ఫిట్స్ వచ్చిన క్రమంలో సమీపంలో ఎవరూ లేకపోవడం తెల్లవారం జాము కావడం.. చలి తీవ్రత అధికంగా ఉండడంతో మృతిచెందడం జరిగిందన్నారు.

ఫ్యాన్ బహూకరణ

రఘునాథపల్లి: మండలంలోని గబ్బెట ఆరోగ్య సబ్‌సెంటర్‌కు మారుజోడు రాంబాబు యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్యాన్ బహూకరించారు. సబ్‌సెంటర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించిన రాంబాబు యువసేన ఫ్యాన్ బహూకరించి ఔదార్యం చాటారు. రాంబాబు యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శివప్రసాద్, సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ రేణుక అశోక్, ఎంపీటీసీ శిరీషసురేష్ పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

రఘునాథపల్లి: అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గబ్బెటలో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మానవ శరీరంలో అన్నింటి కంటే ప్రధానమైనది కంటి చూపు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హషిం, ఎంపీటీసీలు గూడెల్లి శిరీష, కేమిడి రమ్య, వైద్యులు డాక్టర్ కమలహసన్, డాక్టర్ రాధిక, సందీప్, బిక్కునాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, యశోద, మమత తదితరులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

పేద ప్రజల కళ్లల్లో వెలుగులు

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంతో పేద ప్రజల కళ్లల్లో వెలుగులు చూస్తున్నామని సర్పంచ్ బిల్లా అంజమ్మ అన్నారు. ఎనిమిది రోజులు కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలతోపాటు మందులు అందించినట్లు తెలిపారు. శుక్రవారం మండలంలోని కామరెడ్డి గూడెంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిర ముగింపు సందర్భంగా వైద్య బృందం, సిబ్బందిని ఆమె ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు ఏల అనిల్ కుమార్, బొబ్బిలి, మేడబత్రి, జెస్సికా, అంజలి, భాగ్య, వసంత, సంపూర్ణ, ఉప్పలయ్యల పాల్గొన్నారు.



దేవరుప్పులలో వైద్య సిబ్బందికి సన్మానం

గెలుపోటములు అనుభవాలను నేర్పుతాయి

నర్మెట: క్రీడల్లో గెలుపోటములు అనుభవాలను నేర్పడంతోపాటు మానసిక ధైర్యాన్ని ఇస్తాయని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ జి.జమున లింగయ్య అన్నారు. తండ్రి పెద్ది సంజీవరెడ్డి స్మారకార్థం పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి మచ్చుపహాడ్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా, సిద్దిపేట జిల్లాల మూడు రోజుల గ్రామీణ కబడ్డీ క్రీడోత్సవాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారు మాట్లాడారు. క్రీడలు శరీరదారుఢ్యం, మానసికోల్లాసంతోపాటు ఉన్నతస్థితికి చేరుస్తాయన్నారు. మచ్చుపహాడ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అసోసియేషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న కీడల్లో 60 టీములు పాల్గొంటుండగా ఆదివారం ఫైనల్స్ నిర్వహింపబడతాయన్నారు. ఎంపీపీలు తేజావత్ గోవర్ధన్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు మాలోత్ శ్రీనివాస్, గిరి కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు రామిని శివరాజ్, ఆమెడపు కమలాకర్ రెడ్డి, కిరణ్ నాయక్, నీలాలాలు, పావని జయరాం, అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎర్రోల్ల కుమార్, లింగాల పరశురాములు, స్పోర్ట్స్ యూత్ గొల్లపల్లి రాజశేఖర్, రాయారపు రాజశేఖర్, జడల రాజశేఖర్, బైకాని రంజిత్, బుర్రా రాజు పాల్గొన్నారు.



క్రీడాకారులతో నాయకులు

కేటీఆర్ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 27న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలోని వేలేరుకు విచ్చేస్తున్న సందర్భంగా పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా నాయకుడు మోటం ప్రభాకర్, నమిలిగొండ సర్పంచ్ ఉప్పలస్వామి అన్నారు. మండలంలోని నమిలిగొండలో పార్టీ ముఖ్య నాయకులతో కేటీఆర్ సభపై సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడారు. సర్పంచ్ ఉప్పలస్వామి, ఉపసర్పంచ్ రాంచంద్రు, బీఆర్ఎస్ నాయకులు హరికృష్ణ, రాజు, కొళ్యం శివ, అశోక్, శ్రీహరి, కమలాకర్, ఎల్లమ్మ, సంధ్యారాణి, ఐశ్వర్య, పద్మ, సంపూర్ణ, నమీనా, బుచ్చమ్మ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఈ నెల 27న వేలేరు మండల కేంద్రంలో జరగనున్న కేటీఆర్ సభను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ చైర్మన్, మండల ఇన్‌చార్జ్ మార్నేని రవీందర్‌రావు కోరారు. మండల కేంద్రంలో రామాలయం వద్ద పార్టీ సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మేనేజర్ శ్రవణ్‌కు మ్యాజిక్ పవర్ అందజేస్తున్న సర్పంచ్ హయతలి

రఘునాథపల్లి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిడిగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ శ్రవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఫతేషాపూర్‌లో నిడిగొండ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై సర్పంచ్ ఎండీ హయతలి అధ్యక్షతన గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బీమా పథకాలతో కుటుంబాలకు భరోసా లభిస్తోందన్నారు. రైతుబంధు మండల సభ్యుడు గాజులపాటి విరోజి, వీఓఏలు గాజులపాటి రమ, ఉమ్మగోని విమల, గ్రామ పెద్దలు హింగె మోహన్, నానాజి, లోడె నర్సయ్య, బీమయ్య, మహేందర్, కళాకారుల బృందం సభ్యులు రామాంజనేయులు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని శిక్షించాలి

జనగామ రూరల్: కేఎంసీ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఉల్లెంగుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజు మట్లాడుతూ సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక ప్రీతి అధిక మొత్తంలో అనస్థీషియా తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని అన్నారు. పొన్నాల రమేష్, కార్తీక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాంగింగ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

విద్యాలయాల్లో ర్యాగింగ్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి విద్యార్థుల ప్రాణాలను రక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ కోరారు. కేఎంసీ జూనియర్ విద్యార్థినిపై ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనగామ నెహ్రూ పార్క్ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు యశ్వంత్‌రెడ్డి, పవన్, శ్రవణ్, మమత, మాధవి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరి తీయాలి

పాలకుర్తి టౌన్: వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతిని మానసికంగా వేధించిన సైఫ్‌ను ఉరితీయాలని గిరిజన నాయకులు లావుడ్యా మల్లునాయక్, దేవేందర్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రాజీవ్ చౌరస్తాలో ప్రీతిని వేధించిన సైఫ్‌ను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేస్తూ గిరిజన నాయకలు నిరసన తెలిపారు. మహేందర్, బీమా నాయక్, బాలజీనాయక్, అనిల్, సుమన్, ప్రశాంత్, రాజు, ప్రవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దోషులను కఠినంగా శిక్షించాలి

కొడకండ్ల: గిరిజన విద్యార్థిని ప్రీతిని మానసికంగా హింసించిన దోషులను చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరస్వతీ పుత్రికగా చదువులో రాణిస్తూ పేద ప్రజలకు వైద్య సేవ చేయాలనే లక్ష్యంతో జూనియర్‌గా సేవలందిస్తున్న ప్రీతిని సీనియర్ సైఫ్ మానసికంగా హింసిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా కూడా ఉన్నతాధికారులు పట్టించుకొకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించిందన్నారు. సైఫ్ డిగ్రీని రద్దు చేయడంతో పాటు చట్టరీత్యా కఠినంగా శిక్షించాలన్నారు. ఎస్టీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాహూల్, భిక్షపతి, జంగిలి జగన్నాథం, రాజులు పాల్గొన్నారు.

డీఏఓ పరీక్షకు ప్రత్యేక బస్సులు

జనగామ రూరల్: టీఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన నిర్వహించే డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పరీక్ష నేపథ్యంలో జనగామ డిపో నుండి హనుమకొండకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని శుక్రవారం డిపో మేనేజర్ జ్యోత్స్నత్సు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

దేవరుప్పుల: పాఠశాలలో ఒక్కరోజు నిర్వహించిన బాధ్యతలను విద్యార్థులు గుర్తెరిగి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని సర్పంచ్ పులిగిళ్ల సుధాకర్ శుక్రవారం సూచించారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ మహేందర్, హెచ్ఎం బీకోజీనాయక్, వార్డు సభ్యులు పి.సోమయ్య, ఉపాధ్యాయులు దస్రూ, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

తరిగొప్పుల: మండలంలోని పోతారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం ముచ్చాల వెంకటరమణ, ఉపాధ్యాయులు రేణక, అపిత, సుజాత, రవి, సిద్దారెడ్డి, రామచంద్రం, ఎస్ఎంసీ చైర్మన్ సుంకు మౌనిక, మల్యాల రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ



జనగామ రూరల్: శామీర్‌పేటకు చెందిన గీత కార్మికుడు మోడెపు రాజు ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి మృతిచెందాడు. కాగా, శుక్రవారం ఎంపీపీ మేకల కళింగరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు. సర్పంచ్ తాండ్ర స్వరూప, తెల్జీరు సంపత్, ఉప్పలయ్య, మల్లయ్య, కిష్టయ్య, రమేష్, చందు, గణేష్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి..

కొడకండ్ల: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ కుటుంబసభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు పరామర్శించారు. రామోజీ తండ్రి సిందె సత్తాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా డాక్టర్ సుధాకర్‌రావు రామోజీ నివాసానికి వెళ్లి సత్తాజీ చిత్ర పటానికి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు సురేష్, రణధీర్, నవీన్ ఉన్నారు.

నేటి నుంచి దుర్గామాత ఉత్సవాలు

బచ్చన్నపేట: కొన్నెలో నేటి (శనివారం) నుంచి దుర్గామాత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు ఆలయాన్ని సుందరీకరించి, అన్ని వీధుల్లో రంగురంగుల లైట్లను వేశామన్నారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఎస్సై సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



జనగామ రూరల్: దివంగత కవయిత్రులు డాక్టర్ కందాళ శోభారాణి, బైరి ఇందిర సంస్మరణ సభను ఈనెల 26న జిల్లా గ్రంథాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్లటి తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను శుక్రవారం జనగామలోని సుభాష్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. జి.కృష్ణ, సోమేశ్వారాచారి, రమేష్, రాంమూర్తి, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీకి గ్రామ శాఖలే పునాది



నల్ల ఎల్లయ్య, అధ్యక్షుడు

చిల్పూరు: పార్టీకి గ్రామ శాఖలే పునాదులని అందుకు పార్టీ బలోపేతం కోసం పాటు పడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అన్నారు. మండలంలోని రాజవరంలో శుక్రవారం నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నల్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా ఎడ్ల వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడుగా ఎడ్ల ఎల్లయ్య, కార్యదర్శి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కొంరయ్య, మొగిళి, లింగయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ఊమ్లానాయక్, రజిని, సుప్రియ, బాలరాజు, రాజయ్య, దస్‌కోటి, రవి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

మిత్రుల చేయూత

చిల్పూరు: మండలంలోని పీచర గ్రామానికి చెందిన బసవరాజుల సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1990–91లో సంపత్‌తో కలిసి చదువుకున్న మిత్రులు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి చేయూతనందించారు. ఎండీ రాజీమహ్మద్, చీకట్ల రాజు, ఓదెలు, మహేష్, రమేష్, ఉపేందర్, భిక్షపతి, నరసయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ అర్జుల రమాసంపత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.10 లక్షల ఉపాధిహామీ నిధులతో గ్రామంలో పలు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఉపసర్పంచ్ బాషబోయిన రాజు, పంచాయతీ కార్యదర్శి భూక్య లింగం, ఎస్ఎంసీ చైర్మన్ నీల సంపత్, వార్డు సభ్యులు ఐలయ్య, సాయమ్మ ఉన్నారు.

'అతిథి'లో బర్త్‌డే వేడుకలు

జనగామ రూరల్: పట్టణానికి చెందిన రంజిత్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగామలోని అతిథి గురుకుల ఆశ్రమ విద్యాలయంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారిని అమ్మ ఫౌండేషన్ సభ్యులు మంతెన మణి అభినందించారు. కార్యక్రమంలో రాజు, అరవింద్, తిరుపతితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవానికి పాటుపడాలి

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవం కోసం అన్ని వర్గాల ప్రజలు పాటుపడాలని సర్పంచ్ పోతిరెడ్డి బెల్లీనారెడ్డి సూచించారు. శుక్రవారం కడవెండి హైస్కూల్‌లో డీలర్స్ అసోసియేషన్ ఉమ్మడి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గింపుడి శౌరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానంతోపాటు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థుల తాగుగునీటి వసతి కోసం రూ.40 వేల వ్యయంతో కూడిన వాటర్‌ఫిల్టర్‌ను ఇచ్చారు. అనంతరం కరుణాకర్ రెడ్డి, డీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుగ్గింపుడి కిరణ్‌కుమార్‌రెడ్డిను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ లీనారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రుద్రోజు వీరాచారీ, హెచ్ఎం వెంకన్న, సివిల్ సప్లయ్ డీటీ దేవానాయక్, మిల్‌టెక్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్‌గౌడ్, అనాథ శరణాలయ ప్రతినిధి నరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జనగామ రూరల్: రైతులు వరి పంటలో అధిక దిగుబడికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఈఓ తలారి మల్లేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఓబుల్‌కేశవాపూర్‌లో పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ యాసంగి పటలో చీడ పీడలు ఎక్కువగా ఆశిస్తాయని, నాటు వేసిన 20 నుంచి 40 రోజుల వ్యవధిలో కాండం తొలుచు పురుగు ఆకు చుట్టు అధికంగా ఉండి పిలక దశలో ఆశిస్తే పువ్వులు మృతిచెందుతాయని తెలిపారు. నివారణకు క్లోరన్ ట్రానిలీప్రోల్ 4జీ గులికలు ఎకరానికి 4 కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ మల్లేష్

మహిళల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు

దేవరుప్పుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నారని ఐసీడీఎస్ ఏసీడీపీఓ జి.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కడవెండి దొడ్డి కొమురయ్య స్మారక భవన్‌లోని కుట్టుశిక్షణ కేంద్రం, సఖి కేంద్రం ఆధ్వర్యాన హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ బెల్లీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, హెచ్ఎంలు వెంకన్న, బాలు, ఎస్ఎంసీ చైర్మన్ వీరాచారీ, కిరణ్‌కుమార్‌రెడ్డి, చైల్డ్‌లైన్ ప్రతినిధి పద్మ, సఖి కౌన్సిలర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు రహమత్‌బేగం, విజయకుమారి, కోమలత, అరుణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

కేసీఆర్ అస్థిత్వాన్ని కాపాడుకుంటున్నారు



బచ్చన్నపేట: మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

బచ్చన్నపేట: నాలుగు కోట్ల రాష్ట్ర ప్రజలు పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణ చేస్తానని కేవలం తన అస్థిత్వాన్ని మాత్రమే కాపాడుకుంటున్నారని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం కట్కూర్‌లో అసెంబ్లీ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాగోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానికేతరుడు అయిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి రెండు సార్లు ఈ నియోజకవర్గం నుంచి గెలిచి ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఇలాంటి నాయకులకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. కట్కూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన శ్రవణ్‌గౌడ్, కుంట్ల రాములు ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ. 5వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, బూత్ అధ్యక్షులు కదునూరి పాండు, గుడ్ల మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సభాస్థలి పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్‌ల ముగింపు సందర్భంగా శనివారం డివిజన్ కేంద్రంలో జరిగే సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలిని జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, నియోజకవర్గ పాలక్ వట్టివల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి, గట్టు కృష్ణ, శివరాజ్‌యాదవ్, రడపాక పవన్ పాల్గొన్నారు.

కేసీఆర్ చేసింది శూన్యం

నర్మెట: ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి శూన్యమని, రాష్ట్రంలో కొసాగుతున్న అరాచక కుటుంబ పాలనను అంతమొందించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి అన్నారు. మండలకేంద్రంతోపాటు ఇప్పలగడ్డలో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పార్టీ శాఖ అధ్యక్షుడు ధరావత్ రాజు, జిల్లా కార్యదర్శి సాక్కం అనిల్ కుమార్, చిర్ర తిరుపతిరెడ్డి, పినింటి శ్రీనివాస్‌రెడ్డి, గంగం ప్రభాకర్‌రెడ్డి, పాతూరి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యం

పాలకుర్తి టౌన్: బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు లేగ రామ్మోహన్ రెడ్డి, దొంగరి మహేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శాతాపురం గ్రామంలో ప్రజాగోస–బీజేపీ భోరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడూతూ గతంలో బంగారు తెలంగాణ చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం తాగుబోతుల, అప్పుల తెలంగాణ చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ర శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మారం రవికుమార్, పట్టణ అధ్యక్షులు దుంపల సంపత్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సొబగులు



నాటి పాఠశాల భవనం (ఫైల్)



నేటి పాఠశాల భవనం

చిల్పూరు: మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా శిథిలావస్థలో ఉన్న మండలంలోని రాజవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. అంతకు ముందు అధ్వానంగా ఉన్న పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నేడు (శనివారం) ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నూతన గదులను ప్రారంభించనున్నారు.